సాక్షి చిత్తూరు

గురువారం । 21 । నవంబర్ । 2024



దడ పుట్టిస్తున్న డిజిటల్ అరెస్ట్‌లు

ఇటీవల కాలంలో సైబర్ నేరగాళ్లు కొత్త పంథాను ఎంచుకుని డిజటల్ అరెస్టుల పేరిట జనాన్ని దోచుకుంటున్నారు. - 8లో



ప్రయోగాత్మక విద్యనభ్యసించాలి

విద్యార్థులు ప్రయోగాత్మక విద్యను అభ్యసించాలని విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ శ్యామ్యూల్ తెలిపారు. - 8లో



గంజాయి విక్రేతల అరెస్ట్

చిత్తూరు, గంగవరంలో గంజాయి విక్రేతలను అరెస్టు చేసి వారి నుంచి పోలీసులు భారీగా గంజాయి స్వాధీనం చేసుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

విద్యుత్ గ్రీవెన్స్‌కు 3 ఫిర్యాదులు



వినియోగదారుడితో మాట్లాడుతున్న ఈఈ మునిచంద్ర

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో విద్యుత్‌శాఖ ఈఈ కార్యాలయాల పరిధిలో బుధవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు 3 ఫిర్యాదులు వచ్చాయని ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు. అందులో మీటర్ సక్రమంగా పనిచేయడం లేదని, కోర్టు కేసుల్లో ఉండే సమస్య పరిష్కారమైందని గృహ, వ్యవసాయ సర్వీసులు ఇవ్వాలని ఫిర్యాదులు వచ్చాయన్నారు. మీటర్ సమస్యకు చాలెజింగ్ ఫీజు చెల్లించాలని, కోర్టు తీర్పు కాపీలు ఇచ్చి నూతన సర్వీసులు తీసుకోవాలని వినియోగదారులకు తెలిపామన్నారు. సమస్యలను స్థానిక అధికారులకు తెలపాలని పరిష్కారం కాని పక్షంలో 1912 టోల్ ఫ్రీ నంబరుకు తెలపవచ్చన్నారు. చిత్తూరు, పుంగనూరు డివిజన్ కార్యాలయాల నుంచి ఈఈలు మునిచంద్ర, శ్రీనివాసమూర్తి, డీఈ ప్రసాద్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు 407 అర్జీలు



ప్రజాదర్బార్‌లో ప్రసంగిస్తున్న కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం: కుప్పం నియోజకవర్గంలో ప్రతి బుధవారం నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని రామకుప్పం మండలం బందార్లపల్లిలో నిర్వహించారు. కడా పీడీ వికాస్ మర్మత్ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం గంట వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఆయన గ్రామంలో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు చేపట్టారు. బుధవారం అత్యధికంగా 407 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. అందులో 133 రెవెన్యూ, 145 హౌసింగ్ శాఖలకు సంబంధించి ఉన్నాయని, అలాగే మండల ప్రజాపరిషత్ 44, ఆర్డీఓ 22, పశు సంవర్ధక శాఖకు సంబంధించి 25 అర్జీలు రాగా, వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపినట్లు తెలిపారు. ప్రజాదర్బార్‌లో వచ్చిన ఫిర్యాదులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. కుప్పం ఆర్డీఓ శ్రీనివాసలు రాజు, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



ఖాదర్‌బాషాను ఇంటిని కూల్చివేస్తున్న దృశ్యం

"పొట్టకూటి కోసం వచ్చాం.. చిన్న షెడ్డుకుని జీవనం సాగిస్తున్నాం.. కడు నిరుపేదలం.. మాకు ఎవరూ దిక్కు లేరు.. మాపై మీ ప్రతాపం ఏంది సారూ.. మీ కాళ్లు మొక్కుతాం.. మమ్మల్ని రోడ్డున పడేయవద్దు.. మాకు ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధం లేదు. ఉన్నఫళంగా మా ఇల్లు కూలగొడితే మేం ఎక్కడికెళ్లి ఉండాలి ? సారూ.." అంటూ వెదురుకుప్పం మండలకేంద్రంలో నిరుపేద కుటుంబం అధికారుల కాళ్లా వేళ్లా పడి బతిమాలినా.. కనికరించలేదు. చెరువు పక్కన ఖాదర్ బాషా వేసుకున్న చిన్న షెడ్డును అధికారులు జేసీబీతో కూలగొట్టించారు.

ఖాదర్‌బాషాను బలవంతంగా ఈడ్చుకెళ్తున్న పోలీసులు



పోలీసుల కాళ్లు పట్టుకుంటున్న బాధితుడు



తహసీల్దార్ కాళ్లవద్ద కూర్చొని దణ్ణం పెడుతున్న బాధితుడు



కాళ్లు పట్టుకున్నా కనికరించలేదు

- పేదల ఇల్లు కూల్చివేతతో ఉద్రిక్తత
- నిలువ నీడలేదని బాధితులు కన్నీరుమున్నీరు
- వెదురుకుప్పంలో అధికారుల దాష్టీకం
- రాజకీయ నేతల ఒత్తిళ్లే కారణమంటున్న స్థానికులు

వెదురుకుప్పం: గంగాధర నెల్లూరు నియోజకవర్గంలోని వెదురుకుప్పం మండల కేంద్రంలో వాణిజ్య సముదాయం పక్కన ఓ మైనారిటీ వర్గానికి చెందిన ఇంటిని బుధవారం అధికారులు కూల్చివేయడం ఉద్రిక్తతకు దారితీసింది. నిలువ నీడ లేదు.. మమ్మల్ని కరుణించండి అని కాళ్లు పట్టుకున్నా అధికారులు కనికరించలేదని బాధితులు కన్నీరు మున్నీరవుతున్నారు. మండలంలోని వేపేరి గ్రామానికి చెందిన ఖాదర్ బాషా, కై రూన్‌బీ గుజరీ సామాన్ల వ్యాపారం చేసి జీవనం సాగిస్తున్నారు. వారు గత కొంతకాలంగా వెదురుకుప్పంలో స్థిరపడి వ్యాపారం చేసుకుంటున్నారు. ఇల్లు లేకపోవడంతో వెదురుకుప్పం పెద్దచెరువుకు ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో చిన్న షెడ్డు వేసుకుని అందులో తలదాచుకుంటున్నారు. బుధవారం రెవెన్యూ అధికారులు పోలీసుల బందోబస్తుతో వచ్చి వారి ఇల్లు కూల్చివేశారు. ఈ సందర్భంగా ఖాదర్‌బాషా, కై రూన్‌బీ అధికారుల కాళ్లు పట్టుకున్నారు. చేతులెత్తి మొక్కారు. "మేం పేదలం.. మాకు నిలువ నీడ లేదు. ఉన్నఫళంగా ఇంటిని కూల్చి మా కుటుంబాన్ని వీధుల పాల్జేస్తే మేం ఎక్కడ ఉండాలి.. ఎలా బతకాలి.. మేం అమాయకులం.. మాకు ఎలాంటి రాజకీయ పలుకుబడి లేదు.. మాకు దిక్కు లేదు.. కేవలం రాజకీయ కక్షతోనే మాపై ప్రతాపం చూపిస్తున్నారు.. ఇది మంచిది కాదు.. పోలీసులు మమ్మల్ని చిత్రహింసలకు గురి చేసి వేధించి.. ఇంటిని కూల్చివేయడం దారుణం.. మాలాంటి పేదల జీవితాలను వీధుల పాలు చేసిన ప్రభుత్వాలు కూలిపోవడం ఖాయం'' అంటూ బోరున విలపించారు.



ఇదేం ఘోరం దేవుడా అంటున్న వృద్ధురాలు

పేదల కడుపు కొడితే ఊరుకోం

ఏ ప్రభుత్వమైనా పేదల కోసం పనిచేయాలి.. మైనారిటీ వర్గానికి చెందిన ఓ పేద కుటుంబం ఇల్లు లేక తాత్కాలికంగా నిర్మించుకున్న ఇంటిని కూల్చి వేస్తే ఆ కుటుంబం బజారున పడుతుందని వైఎస్సార్‌సీపీ గంగాధర నెల్లూరు ఇన్‌చార్జ్ కృపాలక్ష్మి మండిపడ్డారు. బుధవారం వెదురుకుప్పం మండల కేంద్రంలో అధికారులు నిరుపేద అయిన ఖాదర్ బాషా ఇంటిని కూల్చివేయడంపై ఆమె సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఆమె అధికారులతో మాట్లాడుతూ అక్రమంగా భవనాలు నిర్మించుకున్న వారిని వదిలేసి, ఇలా పేదవారిపై కక్ష కట్టడం ఏంటని ప్రశ్నించారు. మైనారిటీ వర్గానికి చెందిన వారని తెలిసీ అధికారులు విచక్షణా రహితంగా వ్యవహరించడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. అది కూడా బలవంతంగా మహిళలన్న విచక్షణ లేకుండా కొట్టి, రోడ్డుపైకి ఈడ్చి చిత్రహింసలకు గురి చేయడం ఏంటన్నారు. కనీసం వారికి ప్రత్యామ్నాయ వసతి ఏర్పాట్లు కూడా చేయకుండా ఇంటిని కూల్చితే వారు ఎక్కడ ఉండాలని తహసీల్దార్ రమేష్‌బాబును అడిగారు. నిబంధనల ప్రకారం పంచాయతీ రాజ్ శాఖ అధికారులు ఆక్రమణను తొలగించారని తహసీల్దార్ చెప్పారు. ముందుగానే నోటీస్ ఇచ్చి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. చెరువులో ఉన్న వారందరికీ నోటీసులు ఇచ్చినప్పుడు అందరివీ కూల్చకుండా.. కేవలం ఒక్కరిపైనే ఎందుకు కక్ష సాధింపు ఏంటని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు రామయ్య ప్రశ్నించారు. వారికి ముందుగా ఇంటి స్థలం చూపించి న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు. తహసీల్దార్ స్పందిస్తూ ఇంటి స్థలం మంజూరుకు చర్యలు తీసుకుంటామని, తంగేళి మిట్ట సమీపంలో ఉన్న లేఅవుట్‌లో ఇంటి స్థలం కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని కింది స్థాయి సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో బొమ్మయ్యపల్లె సర్పంచ్ గోవిందయ్య, జిల్లా స్టీరింగ్‌కమిటీ సభ్యుడు శివాజీ, మాజీ ఏఎంసీ డైరెక్టర్ గఫూర్ ఉన్నారు.



ఈఓపీఆర్డీని నిలదీస్తున్న కృపాలక్ష్మి

సీఐపై లోకాయుక్తకు ఫిర్యాదు

చిత్తూరు అర్బన్: చిత్తూరు టూటౌన్ సీఐ నెట్టికంఠయ్యపై రాష్ట్ర లోకాయుక్తకు ఫిర్యాదు చేసినట్లు మైనారిటీ సంఘ నాయకుడు అఫ్జల్‌ఖాన్ తెలిపారు. ఈయన ఎస్‌ఐగా విధులు నిర్వర్తించే సమయంలో ఓ ఘటనపై క్రమశిక్షణా చర్యలకు పోలీసుశాఖ ఆదేశిస్తే.. ఆ విషయాన్ని దాచి సీఐగా పదోన్నతి పొందారన్నారు. దీనిపై రాష్ట్ర డీజీపీని సైతం బాధ్యున్ని చేస్తూ లోకాయుక్తకు ఫిర్యాదుచేయగా, విచారణకు ఆదేశించిందన్నారు.

'చిచ్చిలి' కుటుంబానికి అండగా ఉంటాం



చెంగమ్మ గుంత వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

- రొంపిచెర్ల ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డికి పెద్దిరెడ్డి భరోసా

రొంపిచెర్ల: చిచ్చిలి కుటుంబానికి తాను అండగా ఉంటానని మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భరోసా ఇచ్చారు. బుధవారం ఆయన మండలంలోని చిచ్చిలివారిపల్లెలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి తల్లి చెంగమ్మ (95) మృతి చెందడంతో, ఆమెకు అంత్యక్రియలు నిర్వహించిన చోటుకు వెళ్లి పెద్దిరెడ్డి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంపీపీ పురుషోత్తం రెడ్డి తల్లిదండ్రులు చిచ్చిలి వెంకట్రామిరెడ్డి, చెంగమ్మ గ్రామంలో ఎలాంటి మచ్చలేకుండా జీవించారని, అదే విధంగా వారి కుమారుడు కూడా వారి బాటలోనే నడుస్తున్నారని అన్నారు. వారి కుటుంబానికి తాను ఎప్పుడూ అండగా ఉంటా అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, సెంట్రల్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ దేవులపల్లె హరినాథరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మదనమోహన్‌రెడ్డి, ఎం.భాస్కర్ రెడ్డి, నాగిరెడ్డి, శివారెడ్డి, బాలాజీ, రవీంద్ర, కోటా వెంకటరమణ, డాక్టర్ శ్రీనాథ్, జి.రామచంద్రారెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, కరుణాకర్, మహబుబ్‌బాషా, కమలాకర్ రెడ్డి, హరికృష్ణారెడ్డి, సైపుల్లాఖాన్, ఓబులేసు, నీరజాక్షులునాయుడు, ప్రసాద్‌నాయుడు, సురేంద్రనాయుడు, నాగరాజ, శ్రీనాథ్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘన స్వాగతం..

రొంపిచెర్ల పర్యటనకు విచ్చేసిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి పెద్దమల్లెలలో వైస్ ఎంపీపీ నూలు రెడ్డెప్ప ఆధ్వర్యంలో మహిళలు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యేకు హారతులు పట్టి అయ్యప్పస్వామి ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో సచివాలయాల వద్ద టీడీపీ నాయకులు శిలాఫలకాలను ధ్వంసం చేశారని పెద్దిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.


నవజాత శిశుమరణాల నివారణకు కృషి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): నవజాత శిశుమరణాల నివారణకు సమిష్టిగా కృషి చేద్దామని డీఐఓ హనుమంతరావు అన్నారు. చిత్తూరు నగరం టెలిఫోన్ కాలనీలోని అర్బన్‌హెల్త్ సెంటర్‌లో బుధవారం జాతీయ నవజాత శిశు వారోత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భం దాల్చినప్పటి నుంచి గర్భిణులు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు ఆరోగ్య పరీక్షలు చేసుకుంటూ పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ప్రసవం తర్వాత బిడ్డకు తల్లిపాలే ఇవ్వాలని, తద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరిగి నవజాత శిశు ఎదుగుదలకు దోహద పడతాయన్నారు. బాల్య వివాహాలు, టీనేజ్‌లో గర్భం వల్ల తల్లీ బిడ్డకు ప్రమాదం పొంచి ఉంటుందన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు ఉషశ్రీ, లత, జానకీరావ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్ల సుస్థిర పాలన అందించింది. వైద్యరంగంలో సరికొత్త మార్పులు తీసుకురావడంతో పాటు ప్రధానంగా గుండెకు ఆయుష్షు పోసింది. హార్ట్ స్ట్రోక్ నియంత్రణలో భాగంగా సత్వర వైద్యం అందించేందుకు స్టెమీ (ఎస్‌టీ ఎలివేషన్ మయో కార్డియల్ ఇన్ఫర్‌క్షన్) అనే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చింది. దీంతో వేలాది మంది పునర్జన్మ పొందారు. అయితే కూటమి ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఈ నెలలో హంగూ ఆర్భాటాల మధ్య మళ్లీ ప్రారంభించి డప్పు కొట్టుకోవాలని చూస్తోంది.



స్టెమీతో గుండెకు రక్ష

- కరోనా తరువాత పెరిగిన గుండెజబ్బుల కేసులు
- ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించేందుకు స్టెమీకి శ్రీకారం చుట్టిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- జిల్లావ్యాప్తంగా 23 స్పోక్స్ సెంటర్ల ఏర్పాటు
- రెండేళ్లుగా 132 మందికి ఆయుష్షు
- స్పోక్స్ సెంటర్లను మళ్లీ ప్రారంభించేందుకు కూటమి ప్రభుత్వం సన్నాహాలు

కాణిపాకం: ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో వయసుతో సంబంధం లేకుండా గుండె పోటుతో మరణిస్తున్నారు. కోవిడ్ ప్రభావంతో పాటు మారుతున్న జీవనశైలి, పెరుగుతున్న ఒత్తిడి, శారీరక వ్యాయామం లేకపోవడం, ఆహార నియమాల లోపం గుండె జబ్బులకు ప్రధాన కారణాలని హృద్రోగ నిపుణులు చెబుతున్నారు. సరైన నియమాలు పాటించకపోవడంతో బీపీ, మధుమేహ వ్యాధులు సైతం విస్తరిస్తున్నాయి. దీని కారణంగా కూడా గుండె లయ తప్పుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

స్టెమీ అమలు ఇలా ..

స్టెమీ కార్యక్రమంలో భాగంగా చిత్తూరు, తిరుపతి జిల్లాల వ్యాప్తంగా ఏపీవీపీలో పరిధిలో ఉన్న 23 ఏరియా ఆస్పత్రులు, సీహెచ్‌సీలు, జిల్లా ఆస్పత్రుల్లో స్పోక్స్ సెంటర్లు ఏర్పాటు చేశారు. ఈ సెంటర్లకు బయోనెట్ కంపెనీకి సంబంధించిన 12 లీడ్స్ ఉండే ఈసీజీ మిషన్ అందజేశారు. అలాగే కంప్యూటర్ అందజేసి స్టెమీ సాఫ్ట్‌వేర్‌ను అందులో అప్‌లోడ్ చేయించారు. ఐసీయూ బెడ్, ఐవీ స్టాండ్, మల్టీ పారా మానిటర్, 26 రకాల అత్యవసర డ్రగ్స్‌ను అందుబాటులో ఉంచారు. అత్యవసర విభాగంలో పనిచేసే డాక్టర్లు, సిబ్బందితో పాటు ప్రత్యేకంగా ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, స్టాఫ్‌నర్సును కేటాయించారు. గుండె నొప్పితో స్పోక్స్ సెంటర్‌కు వచ్చిన వారికి తక్షణమే ఈసీజీ తీసి ఆ రిపోర్ట్‌ను స్టెమీ యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఇలా చేసిన వెంటనే రెండు నిమిషాల్లో ఆ వివరాలు తిరుపతి రుయాలోని హబ్‌కు చేరుతాయి. అక్కడున్న గుండె వైద్య నిపుణులు రిపోర్ట్ చూసి ఎలాంటి చికిత్స ఇవ్వాలో ఆ యాప్‌లోనే నమోదు చేస్తారు. గోల్డెన్ అవర్‌లో వెళ్తే.. సెంటర్‌లోనే థ్రాంబోలైసిస్ ఇంజెక్షన్ ఇస్తారు. తరువాత హబ్‌కు రెఫర్ చేస్తారు. ఈ ఇంజెక్షన్ ధర మార్కెట్‌లో రూ.45 వరకు ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రచార ఆర్భాటం కోసం వాడుకునేందుకు ప్రయత్నిస్తోంది. త్వరలో కొత్తగా ప్రారంభిస్తున్నట్లు చూపించుకోవాలని పాలకులు యత్నిస్తున్నారు. దీనిపై వైద్యశాఖ నుంచి సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పెరుగుతున్న కేసులు..

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో సుమారు 46 లక్షల మంది జనాభా ఉన్నారు. రెండేళ్ల కిందట ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు ఎన్‌సీడీ సర్వేలో భాగంగా 42 లక్షల మందిని పరీక్షించారు. అందులో 12,02,431 మంది మధుమేహం, 1,96,772 మంది రక్తపోటుతో బాధపడుతున్నట్లు తేలింది. బీపీ, షుగర్ రెండూ ఉన్నవారు సుమారు 80 వేల మంది వరకు ఉన్నారని నిర్ధారణ అయింది. అలాగే 12 వేల మంది గుండె సంబంధిత వ్యాధులతో ఇబ్బంది పడుతున్నట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. స్టంట్ వేసుకుంటున్న వారి సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతోందని అంటున్నారు. వీరి సంఖ్య కూడా రెండు జిల్లాల్లోనూ 8వేలకు పైగా దాటిందని నిపుణుల గణంకాలు చెబుతున్నాయి.

స్టెమీతో 132 మందికి ఊపిరి..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న 23 స్పోక్స్ సెంటర్లలో సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు 26వేల మందికి ఈసీజీ తీశారు. వారిలో 195 మంది గుండె సంబంధిత సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. ఇందులో 132 మందికి థ్రాంబోలైసిస్ ఇంజెక్షన్ రక్షణగా నిలిచింది. 125 మందిని తిరుపతిలోని హబ్‌కు రెఫర్ చేశారు. తద్వారా గుండెనొప్పితో బాధపడుతున్న వారికి స్టెమీ కార్యక్రమం భరోసా కల్పిస్తోంది.

కరోనా తర్వాత..

కరోనా వ్యాప్తితో పలు రకాల జబ్బులు మూటకట్టుకున్నాయి. తొలి విడతలో ఆ లక్షణాలే ప్రజలను భయపెట్టాయి. వైద్య నిపుణుల సూచనలతో మందులు, మాత్రల వాడకం వల్ల కరోనా మహమ్మారి నుంచి ఊపిరి పీల్చుకున్నారు. తక్కువ సంఖ్యలో మరణాలు చోటుకున్నాయి. ఇందుకు ప్రధాన కారణం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కరోనా కట్టడికి యుద్ధ ప్రాతిపదికన నివారణ చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టింది. అయితే కరోనా రెండో విడత ధాటికి జనం విలవిల్లాడిపోయారు. ఆక్సిజన్ అవసరమైంది. ఆ ప్రభావం గుండెపై పడింది. అప్పట్లో చాలామంది ప్రాణాలు కోల్పోయారు. ఆ తర్వాత గుండె జబ్బు సమస్యలతో వందలాది మంది ప్రాణాలు కోల్పోతూ వచ్చారు. ఈ సంఖ్య గణనీయంగా పెరగడంతో అప్పటి రాష్ట్రప్రభుత్వం వెంటనే స్పందించింది. పేదలకు ఊపిరి పోయడంతో పాటు గుండె జబ్బుల నివారణకు స్టెమీ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది.

సైలెంట్ కిల్లర్..

ఒకప్పుడు గుండెపోటు అటే మధుమేహం ఉన్నవారికి, శారీరక శ్రమ లేని వారికి, వయసు మీదపడిన వారికి, ఊబకాయం ఉన్నవారికి మాత్రమే వస్తుంది అనేకునేవాళ్లం. కానీ ప్రస్తుత కాలంలో గుండెపోటు తీరు మారింది. చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా స్ట్రోక్ వస్తోంది. మరీముఖ్యంగా జిమ్ చేస్తున్న వారు, ఎక్కువ జిమ్ చేస్తున్న వారు కూడా ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటీవల గ్యాస్ట్రిక్, ఛాతీలో నొప్పి లాంటివి కనిపించగానే టక్కుమని ఆస్పత్రికి వెళ్తున్నారు. తీరా వెళ్లాక నిజంగానే స్ట్రోక్ వచ్చిందని స్టంట్ వేయడం లేదంటే శస్త్ర చికిత్స చేయాల్సి రావడమో జరుగుతోంది. భిన్నంగా కనిపించే కేసులు కూడా ఉంటున్నాయి. పూర్తిగా గుండె నొప్పి రావడం, ఆయాసంగా అనిపించడం, ఒళ్లంతా చెమటలు పట్టడం వంటివి కూడా గుండె సంబంధిత సమస్యలు కావొచ్చని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు.

గుండెకు మేలు..



ఇటీవల కాలంలో చాలామంది గుండెపోటుకు గురవుతున్నారు. వయసుతో సంబంధం లేకుండా స్ట్రోక్ వస్తోంది. కరోనా సమయంలో చాలామంది స్ట్రోక్‌తో మరణించారు. స్టెమీతో గుండెకు సత్వర చికిత్స అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. గోల్డెన్ అవర్‌లో వచ్చిన బాధితులకు రూ.45 వేలు విలువ చేసే ఇంజెక్షన్‌ను స్పోక్స్ సెంటర్‌లో ఉచితంగా అందిస్తారు. ఇప్పటి వరకు 132 మందికి ఈ ఇంజెక్షన్ ఇచ్చాం. ప్రతి సెంటర్‌లోను 5 ఇంజక్షన్ల చొప్పున్న ఉన్నాయి.

– ప్రభావతి, డీసీహెచ్‌ఎస్, చిత్తూరు జిల్లా

క్లుప్తంగా

ప్రయోగాత్మక విద్యను అభ్యసించాలి

గుడుపల్లె: ప్రాథమిక దశ నుంచే విద్యార్థులు ప్రయోగాత్మకమైన విద్యను అభ్యసించాలని విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ శామ్యూల్ అన్నారు. బుధవారం అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌లో ఎంఈఓలకు, ఉపాధ్యాయులకు 6 రోజులుగా నిర్వహిస్తున్న రీజినల్ లెవల్ లీడర్ షిప్ శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే విధంగా పాఠాలు బోధించాలన్నారు. అనంతరం గుడుపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి సీఆర్‌సీ సమావేశంలో ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు. డీఈఓ వరలక్ష్మి, ఎంఈఓ శ్రీదేవి పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం


మృతి చెందిన వెంకటరమణారెడ్డి

పుంగనూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి మండలంలోని సుగాలిమిట్ట రహదారిపై జరిగింది. రామసముద్రం మండలం చిన్నపల్లెకు చెందిన వెంకటరమణారెడ్డి (60) పనుల నిమిత్తం సుగాలిమిట్ట వద్దకు వచ్చి తిరిగి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. గమనించిన గ్రామస్తులు బాధితున్ని 108లో ఆస్పత్రికి తరలించారు. మార్గమధ్యలోనే క్షతగాత్రుడు చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి, శవాన్ని పోస్టుమార్టంకు తరలించి, దర్యాప్తు చేస్తున్నారు.

దడ పుట్టిస్తున్న డిజిటల్ అరెస్ట్‌లు

- పెచ్చుమీరిన సైబర్ నేరగాళ్ల నయా మోసాలు
- పలుకుబడి ఉన్నవారే వారి టార్గెట్
- మీ అబ్బాయి/అమ్మాయి వద్ద డ్రగ్స్ దొరికాయంటూ భయపెడతారు
- ఆపై అరెస్ట్ అంటూ తల్లిదండ్రులకు ఫోన్ కాల్స్
- సీబీఐ నుంచి మాట్లాడుతున్నామని వీడియో కాల్స్
- కేసు నుంచి తప్పించాలంటే అమౌంట్ పంపాలంటూ బెదిరింపులు
- ఫిర్యాదు చేయడానికి జంకుతున్న బాధితులు
- జాగ్రత్తగా ఉండాలంటున్న సైబర్ క్రైం పోలీసులు



పలమనేరు: నిన్న మొన్నటి వరకు ఒక పంథాలో జరిగిన సైబర్ మోసాలు ఇప్పుడు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. వ్యవస్థలో సాధారణ నేరాల కంటే డిజిటల్ మోసాలే ఎక్కువయ్యాయి. సైబర్ నేరగాళ్లు సైతం సరికొత్తా పంథాను ఎంచుకున్నారు. అదే డిజిటల్ అరెస్టులు. వారు సమాజంలో పలుకుబడి ఉన్న వాళ్లనే టార్గెట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా బయటి ప్రాంతాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు, ఐటీ ఉద్యోగుల తల్లిదండ్రులను లక్ష్యంగా చేసుకుని వారి మొబైల్ నంబర్లను సేకరించి హ్యాకర్లు బ్లాక్‌మెయిల్ చేసి అరెస్ట్ చేశామంటూ బెదిరిస్తున్నారు. కనీసం తాము మోసపోయామని పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు బాధితులు ముందుకు రావడం లేదు. డిజిటల్ అరెస్ట్‌లకు అంతేలేకుండా పోతోంది. కేవలం ఫోన్ కాల్‌తోనే మాటల్లో అరెస్ట్ చేసినట్లు భయాన్ని పుట్టిస్తూ దొరికినంత దోచేస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇలాంటి ఫేక్ కాల్స్‌తో ఇప్పటికే కొందరు లక్షలాది రూపాయలను పోగొట్టుకున్నట్లు తెలుస్తోంది.

మీ అమ్మాయి బ్యాగులో డ్రగ్స్ అంటూ..

ఇటీవల పలమనేరుకు చెందిన భాస్కర్ కుమార్తె బెంగళూరులో సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తూ అక్కడ పీజీలో ఉంటోంది. వీరి తండ్రికి ఓ గుర్తు తెలియని నంబరు నుంచి వాట్సాప్ కాల్ వచ్చింది. మీ అమ్మాయి ఓ పబ్‌లో స్నేహితులతో కలసి ఉండగా ఆమె బ్యాగులో డ్రగ్స్ ఉండగా పట్టుకున్నామని వెంటనే లక్ష పంపాలని కాల్ వచ్చింది. దీంతో భాస్కర్ తన భార్య మొబైల్ నుంచి కుమార్తెకు ఫోన్ చేయగా తాను ఆఫీసులో ఉన్నానంటూ సమాధానం వచ్చింది. అయితే ఆయనకు మళ్లీ అదే నంబరు నుంచి ఫోన్ రావడంతో తాము పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన వారమని ఇంగ్లిషులో గట్టిగా మాట్లాడడంతో ఫోన్ కట్ అయింది. ఆపై ఆ సెల్ నంబర్ స్విచ్ ఆఫ్ అయింది. ఇలాంటి బెదిరింపు కాల్స్ ఈ మధ్యలో ఎక్కువగా వస్తున్నాయి. కొందరు భయపడి డబ్బును ట్రాన్స్‌ఫర్ చేసి ఆపై పోలీసులకు సైతం ఫిర్యాదు చేయకుండా మౌనం వహిస్తున్న వారు ఉన్నారు. ఇలాంటి నకిలీ ఫోన్ కాల్స్‌కు భయపడకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సైబర్ క్రైమ్ పోలీసులు సూచిస్తున్నారు.

కొంపముంచుతున్న కేవైసీ..

ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, ఖాతా నంబరు, సెల్‌ఫోన్ నంబర్లతో కేవైసీ చేస్తుంటాం. అయితే ఈ వివరాలు ఆదాయపు పన్నుశాఖకు వెళ్తుంటాయి. ఈ మొత్తం సమాచారం ఇన్‌సెట్ అయి ఉండడంతో హ్యాకర్లకు డేటాను దొంగిలించేందుకు మంచిమార్గం దొరికినట్లుగా అనుమానం ఉంది. ఇందుకు ప్రైవేట్ సెల్ నెట్‌వర్క్ నుంచి సైతం లీకులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ వివరాల ఆధారంగా మోసగాళ్లు మన స్మార్ట్ ఫోన్ లొకేషన్‌ను ట్రేస్ చేసి ఎవరు ఎక్కడున్నారనే విషయాన్ని సైతం చెప్పగలరు. ఆపై పలు రకాలుగా మోసాలు చేస్తూ మననోటి ద్వారానే ఓటీపీలు చెప్పించి మనల్ని బురిడీ కొట్టిస్తున్నారు.

వీరి మోసాలు ఎలా ఉంటాయంటే..?

పలమనేరు సమీపంలోని కర్ణాటక సరిహద్దు గ్రామానికి చెందిన ఓ కోటీశ్వరురాలి కుమార్తె బెంగళూరులో సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తోంది. ఇటీవల స్వగ్రామానికి వచ్చింది. ఆమెకు ముంబై సీబీఐ పోలీసులంటూ వీడియో కాల్ వచ్చింది. ఆ కాల్‌లో యూనిఫాంలో ఉన్న పోలీస్, వెనుక పోలీస్ సింహాలు అన్నీ కనిపించడంతో నిజమైన పోలీసులే అనుకుంది. వారు కాల్ చేసి బెంగళూరులోని ఐటీ వద్ద ఉన్న మీ అపార్ట్‌మెంట్ రూమ్‌నెం.304కు ఓ పార్శిల్ వచ్చిందని అందులో బ్రౌన్ షుగర్ ఉందని..అందుకే మిమ్మల్ని డిజిటల్ అరెస్ట్ చేశామంటూ చెప్పారు. మీరు అరెస్ట్ కాకుండా తప్పించుకోవాలంటే వెంటనే రూ.10 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేయాలని బెదిరించారు. అయితే ఆమె తనవద్ద డబ్బు లేదని చెప్పింది. ఫలానా బ్యాంకు ఖాతాలో మీ ఎఫ్‌డీలో రూ.2 కోట్లు ఉన్నాయని చెప్పడంతో ఖంగు తిన్న ఆమె వెంటనే రూ.6లక్షలను వారు చెప్పిన నంబర్లకు గూగుల్‌పే, ఫోన్‌పే, ఆన్‌లైన్ ద్వారా నగదు బదిలీ చేసింది. తాను మోసపోయానని రెండురోజుల తర్వాత తెలుసుకున్న బాధితురాలు బెంగళూరు సైబర్‌క్రైమ్‌కు ఫిర్యాదు చేసింది.



సీబీఐ నుంచి మాట్లాడుతున్నామంటూ బెదిరింపు కాల్స్ చేస్తున్న ఫేక్ ఆఫీసర్లు

అసలు నంబర్లు ఎలా తీసుకుంటున్నారో..!

సైబర్ నేరగాళ్లకు మన ఫోన్‌నంబర్లు, వ్యక్తిగత సమాచారం ఎలా చేరుతుందనే విషయం పోలీసులకు సైతం అర్థం కావడం లేదు. నేరస్తులు ఫోన్ చేసి తాము సీబీఐ, నార్కోటిక్స్, ఎక్సైజ్, ఇంటెలిజెన్స్, కౌంటర్ ఇంటెలిజెన్స్‌లాంటి శాఖలను వాడుకుంటూ వారి ఫేసుబుక్ ఖాతాల్లో పోలీసుల ఫేక్ ఫొటోలను పెట్టి పిల్లల పేరు, ఎక్కడ చదువుతున్నారు ? ఏ దేశం, ఏ ప్రాంతం ఇలాంటి వివరాలను ఎలా చెబుతున్నారన్నది అసలు అర్థం కావడం లేదు. హ్యాకర్లు చెప్పే మాటలు నిజాలు కావడంతో పేరెంట్స్ సైతం నమ్మాల్సిన పరిస్థితి నెలకొంది.

మీ పేరు అదే కదా అంటూ..

మేము సీబీఐ నుంచి కాల్ చేస్తున్నాం మీ పేరు అదేనా.. అంటూ వాట్సాప్‌లో 923492151434 అనే నంబరు నుంచి బుధవారం మధ్యాహ్నం తిరుపతికి చెందిన వ్యక్తికి కాల్ వచ్చింది. మీ అబ్బాయి పేరు ఇదేనా అనగానే అవును సార్ ఏమైందని కంగారుగా మాట్లాడారు. డ్రగ్స్ కేసులో మీ అబ్బాయిని అరెస్ట్ చేస్తాం. మీ అబ్బాయి ఎక్కడున్నాడు ? అయితే ఆయన కుమారుడు ఇంట్లో ఉండడంతో ఇదిఫేక్ కాల్‌గా గుర్తించిన ఆయన వారితో మళ్లీ ధైర్యంగా మాట్లాడగా కాల్‌ను డిక్లైన్ చేశాడు. దీనిపై ఆయన సైబర్‌సెల్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.


సీబీఐ నుంచి మాట్లాడుతున్నామంటూ బెదిరింపు కాల్స్ చేస్తున్న ఫేక్ ఆఫీసర్లు

చికిత్స అందించడంలో అలసత్వం వద్దు

- జిల్లాస్థాయి ఆస్పత్రిలో నాణ్యతా ప్రమాణాలు పాటించండి
- ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవు
- కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ హెచ్చరిక

చిత్తూరు కలెక్టరేట్ : పేదలకు అందించే చికిత్స విషయంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకూడదని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాస్థాయి ఆస్పత్రిలో నాణ్యతా ప్రమాణాలు తప్పక పాటించాలన్నారు. ఆస్పత్రిలో నిరుపయోగమైన బయో మెడికల్ వ్యర్థాలను తొలగించేందుకు సరైన విధానాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. డయాగ్నస్టిక్ సేవలు, ల్యాబొరేటరీ సేవలు, శస్త్రచికిత్స సదుపాయాలు, కాన్పు సేవలకు అవసరమైన సదుపాయాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. సమీక్షలో డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి, జిల్లాస్థాయి ఎన్‌క్యూఏఎస్ క్వాలిటీ అధికారి నిరంజన్‌రెడ్డి, జిల్లా క్వాలిటీ మేనేజర్ దివ్య తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' లక్ష్యాలను సాధించాలి

చిత్తూరు కలెక్టరేట్: నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్ శాఖ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి రోడ్ల పనులపై సమీక్షించారు. ఉపాధి హామీ పథకంలో 2024–25 సంవత్సరానికి మంజూరు చేసిన 1500 అంతర్గత సీసీ రోడ్లను త్వరితగతిన పూర్తి చేయాలని, అలాగే పురోగతిలో ఉన్న 612 పనులను డిసెంబర్ 20లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు ప్రారంభించని పనులు త్వరితగతిన ప్రారంభించాలన్నారు. ఎంపీ ల్యాడ్స్ పనులు పకడ్బందీగా చేయాలన్నారు. సమావేశంలో డ్వామా పీడీ రవికుమార్, పంచాయతీ రాజ్ ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

అపార్ నమోదు 71.87 శాతం పూర్తి

జిల్లావ్యాప్తంగా అపార్ నమోదు 71.87 శాతం నమోదైనట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. ఈ మేరకు బుధవారం ఆయన కలెక్టరేట్‌లో రెవెన్యూ, విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల అపార్ కార్డుల మంజూరు కసరత్తులో ఆధార్ కార్డులో సవరణలు వెంటనే పరిష్కరించాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు అపార్ కార్డు మంజూరు చేస్తారన్నారు. ఈ కసరత్తును రెవెన్యూ, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పకడ్బందీగా చేపట్టాలన్నారు. పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను, తల్లిదండ్రులను ఆధార్ సెంటర్లకు పంపకూడదని, సంబంధిత మండలాల ఎంపీడీఓలు, ఎంఈఓలు మొబైల్ ఆధార్ సెంటర్‌లో సవరణను పాఠశాల స్థాయిలోనే చేపట్టేలా పర్యవేక్షించాలన్నారు.

టీడీపీ ఎమ్మెల్యేపై తమ్ముళ్ల తిరుగుబాటు


ఎమ్మెల్యే తీరుపై టీడీపీ మండల అధ్యక్షుడికి గోడును విన్నవిస్తున్న నేతలు

- వేరే పార్టీ నుంచి వచ్చిన వారికే విలువ ఇస్తారా?
- అధిష్టానానికి తెలుగు తమ్ముళ్ల ఫిర్యాదు

గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరులో తెలుగుదేశం పార్టీ నాయకులు స్థానిక ఎమ్మెల్యే తీరుపై మండిపడ్డారు. తమకు విలువ ఇవ్వడం లేదని పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. టీడీపీ సభ్యత్వ నమోదుపై బుధవారం గంగాధరనెల్లూరు ఆ పార్టీ నాయకుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు ఎమ్మెల్యే థామస్ తీరుపై మండిపడ్డారు. ఎమ్మెల్యే ఆది నుంచి ఏకపక్షంగానే వ్యవహరిస్తున్నారని, పార్టీకి మొదటి నుంచి పనిచేసిన కార్యకర్తలు, నాయకులను పక్కనపెట్టి, ఇతర పార్టీల నుంచి టీడీపీలోకి వచ్చిన వారికే పెద్దపీట వేస్తున్నారని ఆరోపించారు . ప్రభుత్వ కార్యక్రమాల సమావేశాల్లో వారిని అందలం ఎక్కిస్తున్నారని, అదేవిధంగా ఆర్థికంగా ఎదిగేలా చేస్తున్నారని మండిపడ్డారు. నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడికి గోడు వినిపించారు. అనంతరం ఒక తీర్మానం చేసి, సమావేశానికి వచ్చిన సభ్యుల దగ్గర సంతకాలు సేకరించి పార్టీ అధిష్టానానికి ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేశారు.

వేర్వేరుగా గంజాయి విక్రేతల అరెస్ట్


నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ నెట్టికంఠయ్య

పలమనేరు/గంగవరం: జిల్లాలోని పలుచోట్ల పోలీసులు గంజాయి విక్రేతలను అరెస్ట్ చేశారు. అందులో గంగవరం సమీపంలోని హైవేలో చిన్నూరు ఫ్లైఓవర్ వద్ద గంజాయిని ఏజెంట్లకు ఇస్తున్న ఓ వ్యక్తితో పాటు మరో ముగ్గురిని గంగవరం పోలీసులు బుధవారం పట్టుకున్నారు. సీఐ ప్రసాద్ వివరాల మేరకు.. పలమనేరు పట్టణం కాకాతోపునకు చెందిన మెకానిక్ మోహన్(35) చిత్తూరులో గుర్తు తెలియని వ్యక్తుల నుంచి గంజాయిని తెచ్చి గంగవరం, పలమనేరుకు చెందిన జోసఫ్, మస్తాన్, ఆంటోనితో అధిక ధరలకు విక్రయిస్తాడు. ఆ క్రమంలో గంజాయి పంపకాలు చేస్తుండగా పోలీసులు వారిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 11.5 కిలోల గంజాయి ప్యాకెట్లును సీజ్ చేసి, కేసులు నమోదు చేసి రిమాండ్ తరలించారు.

చిత్తూరులో ..

చిత్తూరు అర్బన్: చిత్తూరులో గంజాయి విక్రయిస్తున్న షేక్ అల్లాబకాష్ (36), సి.తులసి (22), ఆర్.సురేష్ (29) ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐలు ప్రసాద్, సుగుణతో కలిసి సీఐ నెట్టికంఠయ్య మీడియాకు వివరాలను వెల్లడించారు. మంగళవారం ఇరువారంలోని నీవానది బ్రిడ్జి సమీపంలో పోలీసులు తనిఖీలు నిర్వహించగా వీరి వద్ద కిలోకు పైగా గంజాయి పొట్లాలు లభించాయి. బెంగళూరులో ఉంటున్న అల్లాబకాష్ వైజాగ్ నుంచి గంజాయి తెచ్చి, ఇరువారానికి చెంది న తులసి, ప్రశాంత్‌నగర్‌కు చెందిన సురేష్‌తో నగరంలో విక్రయిస్తారని పోలీసులు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరచగా రిమాండు విధించడంతో జిల్లాజైలుకు తరలించారు.

నిందితుల బైండోవర్

పుంగనూరు: పట్టణంలోని భగత్‌సింగ్ కాలనీలో గంజాయి విక్రయ కేసుల్లో నిందితులైన ప్రభాకర్, లక్ష్మీదేవి, రమణమ్మ, మాధవ, కొండయ్యను స్థానిక తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయించినట్లు ఎక్సైజ్ సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు.

అంతర్రాష్ట్ర చైన్‌స్నాచర్ల అరెస్టు

- పూతలపట్టులో మహిళ మృతికి కారకులు వీళ్లే..!
- కర్ణాటకకు చెందిన ముఠాగా గుర్తింపు
- వివరాలు వెల్లడించిన చిత్తూరు ఎస్పీ మణికంఠ


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మణికంఠ, ఏఎస్పీ

చిత్తూరు అర్బన్: వరుస చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతూ మహిళ మృతికి కారణమైన నలుగురు అంతర్రాష్ట్ర దొంగలను చిత్తూరు పోలీసులు పట్టుకున్నారు. కర్ణాటకకు చెందిన ముల్లహళ్లి శివకుమార్ (35), ఇతని అన్న ముల్లహళ్లి చంద్రశేఖర్ (40), సయ్యద్ రెహాన్ (19), బి.కుమార్ (19) అనే నలుగురి అరెస్టుకు సంబంధించిన వివరాలను బుధవారం చిత్తూరులోని పోలీసు అతిథిగృహంలో ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, డీఎస్పీ సాయినాథ్‌తో కలిసి ఎస్పీ మణికంఠ మీడియాకు వివరించారు.

ఏం జరిగిందంటే..

గతనెల 26వ తేదీ పూతలపట్టు జాతీయ రహదారిపై మూడు చైన్ స్నాచింగ్‌లు జరిగాయి. 3 గంటల ప్రాంతంలో కిచ్చన్నగారిపల్లె వద్ద గుర్తుతెలియని వ్యక్తులు ఓ బైక్‌లో వచ్చి అటుగా వెళ్తున్న మహిళ మెడలోని 64 గ్రాముల బంగారు గొలుసునులాక్కెళ్లారు. 10 నిమిషాల తరువాత పూతలపట్టు–తేనేపల్లె వద్ద బైక్‌పై వెళ్తున్న తల్లీ కూతురిని వెంబడించి వెనుక కూర్చున్న తల్లి మెడలో ఉన్న బంగారు గొలుసును లాగడానికి ప్రయత్నించగా ఆమె కింద పడిపోయింది. చోరీ విఫలమవడంతో నిందితులు పారిపోయారు. మళ్లీ 5 నిమిషాల తరువాత ఐరాల–గుండ్లపల్లె బస్టాప్ వద్ద బస్సు కోసం వేచి ఉన్న నాగరత్నమ్మ మెడలోని 33 గ్రాముల బంగారు గొలుసును లాక్కెళ్లిపోయారు. అయితే తీవ్రంగా గాయపడిన ప్రేమ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయింది.

మూడు రాష్ట్రాల్లో కేసులు..

పోలీసులు మొత్తం ఆరు బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం జల్లెడ పట్టారు. కర్ణాటకకు చెందిన ప్రధాన నిందితుడు శివకుమార్ బెంగళూరు శివారు ప్రాంతాలకు చెందిన రెహాన్, అబ్బు, కుమార్, చంద్రశేఖర్‌తో కలిసి ఓ ముఠాను ఏర్పాటు చేసుకున్నట్లు గుర్తించారు. వాహనాలను చోరీ చేసి కర్ణాటక, తమిళనాడులో చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. ఇదే ముఠా గత నెల చిత్తూరులో చోరీలకు పాల్పడ్డారు. శివకుమార్ కారులో కూర్చుని చోరీలను పర్యవేక్షిస్తాడు. మొత్తం మూడు రాష్ట్రాల్లో నిందితులపైన 30కి పైగా కేసులున్నాయని ఎస్పీ తెలిపారు. నిందితుల నుంచి 53 గ్రాముల బంగారు గొలుసులు, కారు, రెండు బైకులను స్వాధీనం చేసుకు న్నారు. కేసును ఛేదించడంలో ప్రతిభ చూపించిన స్పెషల్‌బ్రాంచ్ సీఐ భాస్కర్, మనోహర్, ఎస్ఐ అనిల్, పూతలపట్టు సీఐ కృష్ణకుమార్, సీసీఎస్ సీఐ ఉమామహేశ్వర్, ఎస్ఐలు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ముగ్గురు డీఎస్పీలకు పోస్టింగులు

చిత్తూరు అర్బన్: పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ముగ్గురు డీఎస్పీలకు పోస్టింగులు ఇస్తూ రాష్ట్ర డీజీపీ ద్వారక తిరుమలరావు బుధవారం ఆదేశాలు జారీ చేశారు. జె.రమేష్‌బాబును చిత్తూరులోని పోలీసు శిక్షణా కేంద్రానికి, ఎస్‌కె.బాబీజాన్ సైదా, జీవీ కృష్ణారావును చిత్తూరులోని 8వ బెటాలియన్‌కు డీఎస్పీలుగా బదిలీ చేశారు.

రాజ్యాంగ దినోత్సవం నిర్వహించండి

చిత్తూరు కలెక్టరేట్ : స్కూళ్లలో డిసెంబర్ 26న భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించాలని విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వులు బుధవారం డీఈఓ కార్యాలయానికి చేరాయి. ఆ ఉత్తర్వుల మేరకు భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పాఠశాల, మండల, జిల్లా, జోనల్ స్థాయి పోటీలు విద్యార్థులకు నిర్వహించాలన్నారు.

సకాలంలో వేతనాలు ఇవ్వాలని వినతి


సీఈఓ రవికుమార్‌నాయుడుతో మాట్లాడుతున్న మెకానిక్‌లు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ హ్యాండ్‌పంప్ మెకానిక్‌లకు సకాలంలో వేతనాలు ఇవ్వాలని జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడుకు వినతి చేశారు. బుధవారం జెడ్పీ కార్యాలయంలో సీఈఓతో ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్ట్ పంప్ మెకానిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జయకృష్ణ వారి సమస్యలపై మాట్లాడారు. మండలానికి ఒకరు చొప్పున హ్యాండ్‌పంప్ మెకానిక్స్ పని చేస్తున్నారని, వీరికి మొదటివారంలో వేతనాలు వచ్చే విధంగా చూడాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి సకాలంలో వేతనాలు వచ్చే విధంగా ఎంపీడీఓలకు ఆదేశాలు ఇవ్వాలన్నారు. దీనికి జెడ్పీ సీఈఓ స్పందిస్తూ ఎంపీడీఓలకు రాతపూర్వకంగా ఆదేశాలు ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వర్‌రెడ్డి, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోకులం షెడ్డు పనులు వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ జేడీ ప్రభాకర్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మినీ గోకులం షెడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని పశుసంవర్ధక శాఖ జేడీ ప్రభాకర్ ఆదేశించారు. చిత్తూరు నగరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మినీగోకులంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మినీ గోకులం పనుల లక్ష్యాన్ని అధిగమించాలన్నారు. లబ్ధిదారులు ప్రతి ఒక్కరూ షెడ్డు నిర్మించేలా చూడాలని చెప్పారు. ఏపీఓ చిన్న రెడ్డెమ్మ, పశు వైద్యాధికారులు పాల్గొన్నారు.

త్వరగా నిర్మించుకోవాలి

గుడిపాల: రైతులు గోకులం షెడ్లను త్వరగా నిర్మించుకోవాలని పశుసంవర్ధకశాఖ జేడీ ప్రభాకర్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో గోకులం షెడ్లకు అర్హులైన రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 55 మందికి గోకులం షెడ్లు మంజూరైనట్లు చెప్పారు. ఇందులో 52 షెడ్లకు జియో ట్యాగింగ్ చేయగా, 35 మందికి గ్రౌండింగ్ అయిందన్నారు.